సీఐగా బాధ్యతలు స్వీకరించిన సతీశ్ కుమార్

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సతీశ్ కుమార్‌ను శనివారం మాజీ ఎన్ఎంసీ కార్పొరేటర్ చిట్ల దివాకర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రగతినగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భాస్కర్‌చారి, మేడా శ్రీనివాసరావు, సురేంద్ర కుమార్ యాదవ్, ఆంజనేయ వర్మ, మధుకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేత



నిజాంపేట్: ప్రగతినగర్ సుందరయ్య భవనం కేంద్రంగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు వివిధ ఫోరమ్స్ ద్వారా నడుస్తున్నాయి. ప్రగతి టెక్ అకాడమీ ద్వారా వ్యక్తిగత, సామాజిక భవిష్యత్‌కు ఉపయోగపడే టెక్నికల్ కోర్సులు ఉన్నాయి. ఇందులో భాగంగా కంప్యూటర్ బేసిక్స్ ఎమ్మెస్ ఆఫీస్, సీ లాంగ్వేజ్, జావా పైథాన్ ఏఐఅండ్ ఎంఎల్, స్పోకెన్ ఇంగ్లీష్ వివిధ కోర్సులలో పలువురు శిక్షణ పొందారు. శిక్షణ పూర్తి చేసుకున్న టెక్ అకాడమీ విద్యార్థులకు శనివారం సర్టిఫికెట్‌లను అందజేశారు.

డంపింగ్ యార్డును వెంటనే తరలించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని డంపింగ్‌యార్డును వెంటనే తరలించాలని ఆకుల సతీష్ డిమాండ్ చేశారు. శనివారం డంపింగ్‌యార్డు వద్ద స్థానికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. డబుల్‌బెడ్ రూమ్‌లు, డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాల నిర్మాణం వద్ద డంపింగ్ యార్డ్ వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు సంవత్సరాలుగా నిజాంపేట్ కార్పొరేషన్ డంపింగ్ యార్డ్ జవహర్‌నగర్‌కి తరలించడానికి కాంట్రాక్టర్‌కి దాదాపు 25 కోట్లు చెల్లించారన్నారు.

రోడ్లు ఆక్రమించి.. ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి!

నిబంధనలను పాటించని భవన యజమానులు

పట్టించుకోని అధికారులు

జగద్గిరిగుట్ట: కొందరు ప్రైవేట్ భవన యజమానులు రోడ్డు స్థలాన్ని ఆక్రమించి ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నారు. నింబధనల ప్రకారం అంతస్తుల భవనాలకు కేటాయించిన స్థలంలోనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకోవాలి. అలా చేయకుండా సదరు భవన యజమానులు రోడ్డు స్థలాలను ఆక్రమించి ఏర్పాటు చేసుకుంటున్నారు. విద్యుత్ అధికారులు అవేవి పట్టించుకోవడంతో అనుమతులివ్వడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఎక్కడపడితే అక్కడ రోడ్లపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో అటువైపుగా రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అసలే అక్రమ నిర్మాణాలు, ఆపై రోడ్లను ఆక్రమించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు చేసుకోవడంపై ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం లేదు.

ఎక్కడపడితే అక్కడ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

విద్యుత్ అధికారులు డబ్బులకు ఆశపడి అక్రమ నిర్మాణదారులకు అండగా నిలుస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. స్థలం ఉన్నా లేకున్నా.. రోడ్లను ఆక్రమించి ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారు. తర్వాత రోడ్లు వాహనదారులకు ఇరుకుగా మారడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు అందులో ఇరుక్కుపోతున్నాయి. నిబంధనల ప్రకారం జి ప్లస్ టు పర్మిషన్ తీసుకొని ఐదు అంతస్తులు నిర్మించిన భవనాలకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఉంటేనే ట్రాన్స్‌ఫార్మర్ బిగించాలి. కానీ అక్రమ నిర్మాణదారులతో కుమ్మక్కై రాత్రికి రాత్రే ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి కాలనీవాసులకు నరకం చూపిస్తున్నారు. ముఖ్యంగా జీడిమెట్ల, షాపూర్ నగర్ ఏడీఈ సెక్షన్ పరిధిలో ఇలాంటి అధికంగా చోటు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇటీవల డి పోచంపల్లి ఏఈతోపాటు ప్రగతి నగర్ ప్రాంతానికి చెందిన ఏఈ ఏసీబీకి చిక్కిన విషయం తెలిసిందే. డబ్బుల కోసం కక్కుర్తి పడి అడ్డంగా ఇద్దరూ అధికారులు దొరికిపోయినా తీరు మారడం లేదన్న విమర్శ ఉంది.





ఉప కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న సూరారం వాసి

రోడ్ల ఆక్రమణలపై చర్యలేవి?

సూరారం డివిజన్‌తో పాటు సుభాష్ నగర్ డివిజన్ పరిధిలో అత్యధిక శాతం మురికివాడ ప్రాంతాలు ఉన్నాయి. అక్కడ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసే విషయంలో గందరగోళం నెలకొంటుంది. అన్ని ప్రభుత్వ స్థలాలు కావడం మూలంగా ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జా చేస్తూ బహుళ అంతస్తుల నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఎటువంటి అనుమతులు లేని ఈ నిర్మాణాలకు విద్యుత్ అధికారులు ఇష్టానుసారంగా మీటర్లను మంజూరు చేయడమే కాకుండా.. కాసులకు కక్కుర్తి పడి ట్రాన్స్‌ఫార్మర్లు సైతం ఏర్పాటు చేస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 15 ఫీట్లు, 20 ఫీట్ల రోడ్లు సైతం రోడ్డు పక్కనే ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి అందిన కాడికి దండుకుంటున్నట్లు చర్చ జరుగుతుంది. సూరారం ప్రాంతానికి చెందిన రవీందర్ ఇటీవలే ప్రజావాణిలో కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నరసింహకు ఫిర్యాదు చేశారు. తక్షణం ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించాలని కోరారు.

కలెక్టర్ ఆదేశించినా ఆగని మీటర్ల కేటాయింపు

గాజులరామారం డివిజన్ పరిధిలోని అనేక ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు ఉండగా ఇక్కడ అక్రమ నిర్మాణాలు చోటుచేసుకుంటున్న విషయంపై పలు పర్యాయాలు కలెక్టర్ ప్రత్యేకంగా సందర్శించి వాటిని కూల్చి వేయించారు. ఈ క్రమంలో విద్యుత్ మీటర్లు కేటాయింపు విషయం చర్చగా మారింది. కొన్ని నిర్మాణాలు లేనప్పటికీ విద్యుత్ మీటర్లు మంజూరు కావడంపై ఆయన సంబంధిత శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినప్పటికీ ఉషా ముల్లపూడి సెక్షన్ పరిధిలో ఈ మీటర్ల కేటాయింపు బాగోతంపై విచారణ చేపడితే సంబంధిత శాఖ అధికారుల అవినీతి బాగోతం వెలుగులోకి వస్తుందని పలువురు బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఒక్కో మీటర్‌కు రూ. 30 వేలు వసూలు చేస్తున్నట్లు తెలిసింది.

ప్రజలను ఇబ్బందులకు గురి చేయొద్దు



మాట్లాడుతున్న కూన శ్రీశైలంగౌడ్



సమావేశంలో పాల్గొన్న కమ్యూనిటీ సభ్యులు

మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

నిజాంపేట్: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి ప్రణీత్ ఆంటీలియా గేటెడ్ కమ్యూనిటీలో శనివారం మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ పర్యటించారు. వారితో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గేటెడ్ కమ్యూనిటీ నుంచి 100 అడుగుల రహదారి ప్రవేశపెట్టే ప్రయత్నాలు నిలిపివేయాలని సంబంధిత అధికారులను కోరారు. ఎన్నో సంవత్సరాల నుంచి నివసిస్తున్న ప్రజలను ఇబ్బందులను గురి చేయొద్దన్నారు. ప్రణీత్ ఆంటీలియా కాంపౌండ్ వెనుక భాగంలోని సర్వే నంబర్ 170, ఉప సర్వే నంబర్లు, నిషేధిత జాబితాల్లో ఉన్నాయని, అదేవిధంగా ఈ విషయాన్ని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్తానని భరోసా ఇచ్చారు. సమావేశంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మహేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు శ్రీరాజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

సుభాష్‌నగర్: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని సీఎంఆర్ స్కూల్ కరస్పాండెంట్ సీహెచ్ గోపాల్ రెడ్డి అన్నారు. గాజులరామారంలోని సీఎంఆర్ స్కూల్‌లో హెడ్ బాయ్, హెడ్ గర్ల్ నిమిత్తం శనివారం ఎన్నికలు నిర్వహించారు. 5వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. చదువుతో పాటు ఓటు యొక్క ప్రాధాన్యతను తెలియజేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం ఎన్నికల ఫలితాలను ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జోత్స్న, ఏవో సత్తిబాబు, వైస్ ప్రిన్సిపాల్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.



ఓటు వినియోగించుకున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

చెరువు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



నిజాంపేట్: లైఫ్ చారిటబుల్ ట్రస్ట్, ఒరాకిల్ కంపెనీ ఆధ్వర్యంలో శనివారం ప్రగతినగర్ అంబీర్ చెరువు పరిసర ప్రాంతాల్లో శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. చెరువు గుట్టలు, వాకింగ్ ట్రాక్ చుట్టూ పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, కలుపు మొక్కలను తొలగించారు. చెరువు చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచారు. చెరువు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పలువురు సూచించారు. కార్యక్రమానికి అంబీర్ వాకర్స్ అసోసియేషన్, యూత్ ఫర్ సేవ, ప్రగతినగర్ లేక్ వ్యూ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, వీటి వివో వాలంటరీ సంస్థల నుంచి మద్దతు లభించింది. కార్యక్రమంలో లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కె.ప్రశాంత్‌కుమార్, ఒరాకిల్ ప్రతినిధులు, పలువురు ఎన్‌జీవో వాలంటీర్లు, రాధ, సంజయ్, గోవిందరాజు, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్: స్థానిక సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్‌లోని కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన కార్పొరేటర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, సంక్షేమ సంఘాల నేతలు శనివారం కలిసి వివిధ సమస్యలు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికారులు ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించేవిధంగా చొరవ చూపాలన్నారు. అదే విధంగా పలు ప్రాంతాల్లో జరుగుతున్న బోనాల పండుగ ఉత్సవాల వేడుకల్లో పాల్గొనాలని పలువురు ఆహ్వాన పత్రికలు అందజేశారు.



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును సన్మానిస్తున్న నేతలు

నేడు నియామక పత్రాలు అందజేత

చింతల్: బీజేపీ 128 చింతల్ డివిజన్ కమిటీ యొక్క నియామక పత్రాలు ఆదివారం సూరారం కట్టమైసమ్మ ఆలయ ఆవరణలో అందజేయనున్నట్లు ఆ పార్టీ చింతల్ డివిజన్ అధ్యక్షుడు రాజేష్ చారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లోని రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, నియమితులైన కమిటీ మెంబర్స్‌తో పాటు సీనియర్ కార్యకర్తలు పాల్గొనాలన్నారు. ముఖ్య అతిథులుగా మేడ్చల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్ మల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



కుత్బుల్లాపూర్: విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సీఐ విష్ణువర్ధన్ అన్నారు. సుభాష్‌నగర్‌లోని నేతాజీ హైస్కూల్‌లో శనివారం ఇన్వెస్టిచర్ (పదవి స్వీకార వేడుక) ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అజుడ హాస్పిటల్ డాక్టర్ భరత్‌కాంత్ రెడ్డితో కలిసి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన స్కూల్ కెప్టెన్ నవనీత్, వైస్ కెప్టెన్ షగూన్ బాధ్యతలు స్వీకరించారు. అదే విధంగా స్పందన గ్రూప్ కెప్టెన్‌గా మౌనిక, స్పృహ గ్రూప్ కెప్టెన్‌గా మహాలక్ష్మి, చైతన్య గ్రూప్ కెప్టెన్‌గా రాకేష్, స్ఫూర్తి గ్రూప్ కెప్టెన్‌గా దేవిశ్రీ, ఇతర క్లబ్ కెప్టెన్లు బాధ్యతలు స్వీకరించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో చైర్మన్ శివయ్య, వరప్రసాద్, వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, జనరల్ సెక్రటరీ రవికుమార్, పాఠశాల కరస్పాండెంట్ చింతల మహేష్ కుమార్, అకాడమిక్ డైరెక్టర్ నందిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు మైసమ్మ బోనాలు

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ హెచ్‌పీ రోడ్డులోని మైసమ్మ తల్లికి ఆషాఢ మాసం బోనాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తూము జగదీష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, భక్తుల బోనాల సమర్పణ, సాయంత్రం ఫలహారబండి ఊరేగింపు వంటి పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొననున్నట్లు తెలిపారు.

నిధులు కేటాయించాలని ఎంపీకి వినతి



ఎంపీకి సమస్యలు వివరిస్తున్న నాయకులు

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపల్ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు సతీష్ సాగర్ ఆధ్వర్యంలో శనివారం ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్‌లోని 18 వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీ, మురికి కాలువలు, మౌలిక వసతుల కోసం తగిన నిధులు కేటాయించాలన్నారు. ఎంపీ నిధులు కేటాయించి సమస్యలు పరిష్కరిస్తానని ఎంపీ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కో కన్వీనర్ శివాజీ రాజు, మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు సరిత, ఆదిరెడ్డి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం!



రంగారెడ్డినగర్: ఓ వైపు విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పేరుతో అడపా దడపా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నా వాస్తవ పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉంటున్నాయి. కొన్ని చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లకు, విద్యుత్ స్తంభాలకు తీగలు అల్లుకుని కనిపిస్తున్నాయి. దీంతో తరచూ విద్యుత్ ట్రిప్ అయి సరఫరా నిలిచిపోతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రంగారెడ్డినగర్ డివిజన్ సంజయ్‌గాంధీ నగర్ రోడ్డు – గాంధీనగర్ రోడ్డులో ఓ విద్యుత్ స్తంభానికి తీగలు అల్లుకున్నాయి. దీంతో సమీప ఇళ్ల వాసులకు గాలి వీచిన ప్రతిసారి విద్యుత్ సరఫరా నిలిచిపోతోందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మొక్కుబడిగా కాకుండా విద్యుత్ తీగలకు అల్లుకున్న తీగలను పూర్తి స్థాయిలో తొలగించాలని పలువురు కోరుతున్నారు.

బలహీన వర్గాలకు కాంగ్రెస్ పెద్దపీట



గండిమైసమ్మ చౌరస్తాలో క్షీరాభిషేకం చేస్తున్న బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు



జీడిమెట్లలో బండి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో..

42 శాతం రిజర్వేషన్ల తీర్మానం పట్ల క్షీరాభిషేకాలు

దుండిగల్: బడుగు, బలహీన వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని నాయకులు అన్నారు. స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పిస్తూ మంత్రివర్గ తీర్మానంపై హర్షం వ్యక్తం చేస్తూ లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు గండిమైసమ్మ చౌరస్తాలో మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, నేతలు నవీన్‌రెడ్డి, కిశోర్‌రెడ్డి, ముత్యంరెడ్డి, సదానందం, మైసిగారి శ్రీనివాస్, సాదు యాదవ్, కుమార్ యాదవ్, పరశురాం, నర్సింగ్‌గౌడ్, రాజయ్య, అక్బర్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా జీడిమెట్లలో కుత్బుల్లాపూర్ బీ బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గౌరిగే బాలప్ప, మధుసూదన్ రెడ్డి, పూర్ణ చందర్, 132 డివిజన్ యూత్ ప్రెసిడెంట్ పులి సందీప్ గౌడ్, అనిల్, ఆంజనేయులు, బేక్ స్వప్న, లక్ష్మి, రేవతి, అశ్విని, రజిత తదితరులు పాల్గొనారు.

వ్యర్థాలను తరలించరూ!

జగద్గిరిగుట్ట : డిమాలిష్ చేసిన భవన నిర్మాణ సామాగ్రిని ఎక్కడపడితే అక్కడే డంప్ చేస్తున్నారు. రాత్రి వేళల్లో టిప్పర్‌ల సహాయంతో ఎక్కడ ఖాళీ స్థలం ఉంటే అక్కడ డంప్ చేస్తున్నారు. డివిజన్ పరిధిలోని రింగ్ బస్తీలో ఇండ్ల మధ్యనే డంప్ చేయడంతో కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చింతల్: చెట్ల కొమ్మల తొలగింపు, ఆయా సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు బోయిన్‌పల్లి ఏడీఈ శ్రీకాంత్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 33/11 హెచ్ ఏ ఎల్ సబ్ స్టేషన్ ఇండియన్ రబ్బర్ ఫీడర్ పరిధిలో సీఐఈ గాంధీనగర్, శ్రీరామ ఇండస్ట్రీస్ ఏరియా, శ్రీనివాస ఎంటర్‌ప్రైజెస్ లైన్, ఎంటీఏఆర్ టెక్నాలజీ ఏరియాస్, ప్రాగా టూల్స్ సబ్ స్టేషన్ రంగారెడ్డి నగర్ ఫీడర్ పరిధిలో గాంధీనగర్, గురుమూర్తి నగర్, గిరి నగర్, ఆదర్శనగర్, ఏపీహెచ్‌బీ కాలనీ, సుమిత్ర నగర్, గుడెన్ మెట్టు, తదితర కాలనీలు మధ్యాహ్నం రెండున్నర నుంచి సాయంత్రం ఐదున్నర గంటల వరకు హెచ్ఏఎల్ సబ్ స్టేషన్ లోకేష్ మిషన్ ఫీడర్ పరిధిలో సీఐఈ బాలానగర్ ఇండస్ట్రియల్ ఏరియా పూర్తిస్థాయిలో, ప్రాగా సబ్ స్టేషన్ ఎల్అండ్‌టీ ఫీడర్ పరిధిలో సీఐ గాంధీనగర్, గాంధీనగర్, ఎల్అండ్‌టీ వేకటేశ్వర లైన్, సైకి టోస్ ఏరియా తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.